

[స్థలం : అభివృద్ధి చెందిన పెద్ద నగరం.
రంగస్థలం : మధ్యతరగతి గృహంలో హాలు.
సమయం : అందరూ ఆఫీసులకు వెళ్ళే వేళ.
రంగస్థల రచన : విశాలమయిన హాలు, కుడివేపు ద్వారం వీధి లోకి, ఎడంవేపు ద్వారం వంటింట్లోకి దారి తీస్తాయి. రంగస్థలానికి మధ్యగా వెనకవేపు ఒక ద్వారం ఉంటుంది. అది రావుశ్రీ గది లోకి తెరిచినా అతని ఫోటో పెద్దది ద్వారానికి మీదుగా ఉంటుంది. కాలెండర్లు లేనిదే ఇల్లు కాదు గనక అవీ అందంగా తగిలించబడి ఉంటాయి. ప్రక్కకి కుడివేపు గోడనానుకుని టేబుల్, కుర్చీ ఉంటాయి. అది డ్రాయింగ్ టేబుల్-కమ్-డైనింగ్ టేబుల్ కావటం మరేదాన కిటికీగా మనకాళ్ళు తెలిపిస్తూ ఉంటుంది. మధ్య ద్వారానికి పక్క కుర్చీ వాలు కుర్చీ ఉంది. హాలు మధ్యగా అతిథుల కోసం మూడు ఫోయరు, ఒక టీపాయ్ అమర్చబడి ఉంటాయి.]

తెర లేచే సరికి రంగారావు గారు కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూ ఉంటాడు. వంటింటి వేపునుంచి గిన్నెలు, గరిటెల చప్పుడు మధ్య మధ్య వినిపిస్తూ ఉంటుంది. క్షణాల తరవాత రావుశ్రీ తన గదిలోంచి ప్రవేశిస్తాడు.

## పాత్రలు :

| | |
|---|---|
| రంగారావు | 48 సం. |
| రావుశ్రీ | 25 సం. |
| యోధనాథం | 30 సం. |
| నిరాశ | 25 సం. |
| దురాశ | 25 సం. |
| సుధ | 20 సం. |

ఇంకా
ఇన్‌స్పెక్టరు, పోలీసులు

మనిషి అందంగా ఉంటాడు. డ్రెస్ నీటుగా ఉంటుంది. ప్రవేశిస్తూనే తండ్రితో ఏదో చెబుదా మనుకుంటాడు. సంశయపడి టేబుల్ వద్దకు వెళ్లి ఏవో కాగితాలు వెదికినట్టు నటిస్తాడు. మళ్లీ ధైర్యం కూడగట్టుకొని తండ్రి దగ్గరకు వస్తాడు. రంగారావు పేపర్లోంచి తలఎత్తి చూస్తాడు. రావుశ్రీ గుండె గొంతుకలోనికి వస్తుంది. ఏదో పని ఉన్న వాడిలా చరాలున తన గదిలోనికి పోతాడు. ఏం తోచక లోనుండి "అమ్మా!" అని కేకవేసి వంటింటివేపు పరుగులాంటి నడకతో వెడతాడు. అతని చూరా అంతా గమనించి —

**రంగారావు :** ఏం చెప్మా వీ డిలా మెలికలు తిరిగి పోతున్నాడూ!! ఏదో ఉంది కథ! (రెండడుగులు ముందుకి వేస్తాడు. కుర్చీ కాలికి తగులుతుంది.) ఇవ్వోపాటి! నాటకంలో సెట్ లాగు హాలు మధ్య వీటిని తగలేస్తాడు. మూరు రూపాయలు తెచ్చుకునేసరికి ప్రతి వాడికీ ఒక డ్రాయింగు రూము అవసరమయి పోతోం దీమధ్య! గదిలో ఉన్న సామాన్లు పక్క కొట్లో పారెయ్యటం, గది మధ్య మూడు కుర్చీలు తగలెయ్యడం! ఏమిటో వెధవ ఫాషను! ! (వంటింట్లోంచి భార్య గొంతుక విని) ఏమిటీ! అబ్బాయి ఏదో చెబుతాడా? చెప్పమనూ. మధ్య నీ రికమెండేషను దేనికీ! అది సరే. అదేదో వాణ్ణే చెప్పి తగలడమను.
(ద్వారం దగ్గర రావుశ్రీ తల గోక్కుంటూ నిలుచుంటాడు.)
ఆఁ! ఏమిటోయ్ విషయం? వచ్చిన జీతంలో సగం కాఫీ కొట్టుకి, కిళ్లీ బడ్డీకి జమకట్టేశా నంటావ్! అంతేనా? !

**రావుశ్రీ :** అది కాదు, నాన్నా! మరీ ...

**రంగారావు :** మరి? చెప్పు మరీ ! !

**రావుశ్రీ :** నేనొక అమ్మాయిని ప్రేమించాను, నాన్నా! మేమిద్దరం ...

**రంగారావు :** ఏమిటీ! ఇద్దరూ కలిసి ఒక అమ్మాయిని ప్రేమించారా! ! ఆ రెండో వెధ వెవడు? !

**రావుశ్రీ :** అబ్బా! అదికాదు, నాన్నా! ప్రేమించింది నే నొక్కణ్ణే. ఆ అమ్మాయినే నేను పెళ్ళిచేసుకుందా మనుకుంటున్నాను.

**రంగారావు :** ఇదేమన్నా సిండికేటు వ్యవహార మనుకుంటున్నా వేమిట్రా. అన్నీ తేల్చేసుకుని ఆఖర్ని అనౌన్సు చెయ్యటానికి! తరవాత తల బొప్పి కడితే గావుకేకలు వెయ్యడానికీను! కుటుంబ గౌరవం, మంచీ మర్యాదా చూడక్కర్లే?

**రావుశ్రీ :** ఆ అమ్మాయి చాలా మంచిది, నాన్నా!

**రంగారావు :** మంచిదేన్లేవోయ్! మంచిది కాకపోతే ఆంధ్రదేశమంతా గొడ్డుపోయి నట్టు చవటాయివి నిన్ను ప్రేమించడ మేమిటి?

**రావుశ్రీ :** నిజం, నాన్నా! చదువుకున్నది. గుణవంతురాలు. మీరు ఆ అమ్మాయిని చూస్తే తప్పకుండా నచ్చుతారు.

**రంగారావు :** ఆ చవటన్నర కూతలే కుయ్యొద్దన్నాను! నచ్చాల్సింది నాకు గాదు, నీకు!! అయినా నాకు తెలియక అడుగుతానూ—నీతో ఆ అమ్మాయి ఎలా కాపురం చేస్తుందో నా కర్థం కాదు. నీ కొచ్చే జీతం నూట ఏభై రూపాయిలా? అందులో ఏభై రూపాయిలు నీ సిగరెట్లకు, కాఫీలకు పోతే మిగిలింది నూరు! ఆ నూటికీ నీ మీద ఆధారపడ్డ ముసలి ఘటాలు రెండు! ! ఏం తిందామని, ఎలా బావుకుందామనీ నిన్ను ప్రేమించిం దా అమ్మాయి! !

**రావుశ్రీ :** ప్రేమకు డబ్బు, అదిచ్చే సౌఖ్యాలు అడ్డం కావు, నాన్నా! ఒకరినొకరు అర్థం చేసుకున్నాం. ఒకరి కష్టాల్లో ఒకరు భాగస్వాముల మవుతాం! నన్ను ప్రేమించినందుకు తన జీవితం ధన్యమైనట్టు భావిస్తోం దా ప్రేమమూర్తి! ! ఆమె నాలో తానొక అణువై పరవశించి పోతుంది!

**రంగారావు :** పరవశం కాదురా. నిన్ను చేసుకుంటే పరమ శవం అవుతుంది. జీవితంలో అనుభవంలేక నిన్ను పెళ్లాడతా నంటోందా అమ్మాయి!

**రావుశ్రీ :** ఏం, నాన్నా, నాలో ఏం లోటుందని! ! అందం ఉంది, చదువుంది. ఉద్యోగం ఉంది. ఇంకా ఏం కావాలి? చాలవా ఇవి?

**రంగారావు :** చాలు! నీకు అందం ఉంది, కానీ. నీ బ్రతుక్కేదీ అందం! ! చదువుంది! ఎందుకు? ఆ అమ్మాయిని కూర్చోబెట్టి పాఠాలు చెబుతావా? ఉద్యోగం ఉంది! ... కానీ, ఎప్పుడు ఊడుతుందో తెలియదు! ! ఎందుకురా ఉండీ లేని వాటిని పట్టుకొని ఈ మిడిసిపాటు!

**రావుశ్రీ :** అయితే ఏమంటారు, నాన్నా? నాకు పెళ్లి చేసుకునే అర్హత లేదంటారా?

**రంగారావు :** ఎందుకు లేదురా! ఈ దేశంలో కుర్రకారుకి ఉన్నది అదొక్కటే అర్హత! అంతకుమించి బాధ్యతలు ఎవరి కున్నాయి గనక! !

**రావుశ్రీ :** పుట్టుకనుంచీ బాధ్యతలు నెత్తిని వేసుకుంటే గాని మీకు సంతోషంగా ఉండదు గాబోలు. ముద్దూ ముచ్చటా లేకుండా ...

**రంగారావు :** ఎంత ముచ్చటగా చెప్పావురా, నా తండ్రీ! ! పుట్టుకనుంచీ బాధ్యతలు ఒంట బట్టక, చచ్చేవరకూ హక్కుల కొరకు పోటాడుతూ ఉండబట్టే దేశం ఇంత సుభిక్షంగా తగలడి పోతూందిరా! !

## శ్రీ నీలిమ

**రావుశ్రీ :** ఊరుకుందురూ! ఎప్పుడూ దేశం, తిండీ, పనీ తప్ప మరో సున్నిత విషయం మీకు ఒంటబట్టదు. కళలూ, సాహిత్యం, మమతలూ, మధుర భావాలూ మీకు అర్థం కావు, నాన్నా!! వాటి ఔన్నత్యం మీకు అందదు! అందుకనే గతంలో మీ జీవితాలు రసహీనమై, ఎడారులై, ఎండిన మోడులై వెల్లమారినాయి.

**రంగారావు :** అదేమిటి? కవిత్వ మెప్పట్నుంచీ నేర్చుకున్నావు! దాని వికారమే నేమిటి ఈ పైత్యమంతాను! ఇహ ఫర్వాలేదు. ఆ చేసుకునే అభాగ్యురాలు అన్నం తిన్నట్టే! !

**రావుశ్రీ :** కవిత్వం పనికిరానిదా, నాన్నా! కవిత్వం తిండిపెట్టలేక పోవచ్చు కానీ, అది తెచ్చే కీర్తి ముందు ఈ క్షణిక సంపదలు ఏమాత్రం, నాన్నా?

**రంగారావు :** శాశ్వతమైన మాట చెప్పావు, కుమారా! కీర్తి ముందు ఈ సంపదలు క్షణికం. కానీ, ఈ రోజుల్లో కీర్తి కూడా డబ్బు లేనిదే రాదే! డబ్బుంటే కొండమీది కోతి కూడా దిగొస్తుంది!

**రావుశ్రీ :** అదేమోగానీ మీ మాటలు వింటే నాకు విసుగొస్తుంది.

**రంగారావు :** మంచిది! విసిగి వేసారిన జీవితాలనుండే నిజమైన కవిత ఉద్భవిస్తుంది. నీలా విలాసంగా జీవించే వారి నుండి వచ్చేది కవిత్వం కాదు కసిత్వం! శ్రుతిమించితే కపిత్వమూను! !

**రావుశ్రీ :** ఇంతకూ నా పెళ్ళిసంగతేం చెపుతారు? !

**రంగారావు :** చేసుకో! !

**రావుశ్రీ :** ఆఁ ! !

**రంగారావు :** అవును. చేసుకోవోయ్! !

**రావుశ్రీ :** మరి ఇంతవరకూ ఎందుకు వద్దన్నారు? !

**రంగారావు :** ప్రేమ జబ్బు ఎంతవరకు ముదిరిందో చూద్దామనీ!

**రావుశ్రీ:** జబ్బేమిటి, నాన్నా! ప్రేమ దైవస్వరూపం. ఎంతో పుణ్యం చేసుకుంటే గానీ ప్రేమించే భాగ్యానికి నోచుకోలేం.

**రంగారావు :** అవును, నోచుకోలేం. అందుకనే నిన్ను చేసుకోవాలనుకుంటున్న నిర్భాగ్యు లెవరో చూడాలని ఉంది.

**రావుశ్రీ :** నాన్నా! మీరు నన్ను మరీ తేలికగా చూస్తున్నారు.

**రంగారావు :** నిన్ను తేలికగా ఎలా చూడగలనురా! నీ బరువు నాకు తెలియదూ?

**రావుశ్రీ :** మీ హాస్యానికీ, కోపానికీ భేదం తెలియదు. సరే! నేను వస్తాను. ఆఫీసు కెళ్లాలి!

రంగారావు : వెళ్ళు! వెళ్ళు!! అయిదు నిమిషాలు ఆలస్య మయితే చీవాట్లు తప్పని ఉద్యోగమాయె మరి!

( రావు శ్రీ వెళ్ళిన తరవాత రెండు సార్లు పచార్లుచేసి వంటింటి వేపు చూస్తూ ) ఒసేవ్! విన్నావా! ? నీ కుమార రత్నం మించాడు. అదేలే ప్రేమించాడు. ఇక పెళ్ళాడుతాడట. ఆపైన స్వర్గానికీ, నరకానికీ మధ్య వేళ్ళాడుతాడు. ఆఁ! ఏమిటీ? ! ... చోద్యమా! చోద్యంకాదు మరీ! ! నిన్ను చేసుకున్నాక నేనూ, వాడిలాగే జీతం కోసం దిక్కులు చూసి, నిన్ను వంటింట్లో కట్టబెట్టి ఉంటే నీకు అర్థమయ్యేది చోద్యమేమిటో! నీ కే మర్థమవుతుందీ ఈ గుమాస్తా గాడి పెళ్ళాం పడబోయే బాధ ఏమిటో! అందీ అందని ఆశలతో, ఆకలితో, పిల్లలతో వడగాలిలో ఎండుటాకులా వడవడ వణికి పోతుంది! ... ఏమిటీ ! వాడికేమిటి లోటా! ? ఆ మాటే అనవద్దన్నాను ... ఆ సంగతి వాడి దగ్గర కూడా అన్నావా? అందుకే ని న్నిక్కడికి రావద్దన్నాను ...

[ ఈ మాట లంటూండగా సుధ ప్రవేశిస్తుంది. ఆమెలో అందం కన్నా ఆకర్షణ, చురుకుదనం ముందుగా కనిపిస్తాయి. తొలి చూపులోనే మనుష్యులను ఆకట్టుకొనే విద్య ఆమె నేత్రాలకు బాగా తెలుసు. ]

సుధ : అదేమిటండీ! ఇంట్లోకే రావద్దంటున్నారు ... నే నెవరో మీకు తెలుసా ?!

రంగారావు : తెలియదు! తెలిస్తేమాత్రం ఎందుకు రావద్దంటానూ? ఇంతకూ ఎవరమ్మా నువ్వు !! ?

సుధ : నాపేరు సుధ అండీ!

రంగారావు : అమృతంలా ఉంది పేరు! !

సుధ : కలెక్టరేట్‌లో స్టెనోగా పనిచేస్తున్నాను.

రంగారావు : చాలా సంతోషం!

సుధ : మీ అబ్బాయిగారికోసం వచ్చాను.

రంగారావు : వాడు ఉద్యోగంకోసం పరుగెత్తాడు.

సుధ : అదేమిటీ! ఆయనకు ఉద్యోగం ఉందికదండీ.

రంగారావు : ఉంది గనకనే ప్రేమించిన అమ్మాయితో పెళ్ళి విషయం తేల్చుకుందుకు కూడా టైము లేకుండా పరుగెత్తాడు.

సుధ : అయితే, ఆయన మీతో విషయం చెప్పారన్న మాట.

రంగారావు : నువ్వూ ఆ విషయమే చెబుదామని వచ్చావన్న మాట!

సుధ : అవునండీ! మే మిద్దరం ప్రేమించుకున్నాం. చాలాకాలంనుంచి మీ అనుమతి పొందమని చెబుతున్నాను. కానీ, ఆయనే కాలయాపన చేసుకుంటూ వచ్చారు. చివరకు నేనే ...

రంగారావు : కాలయాపన గాక సకాలంలో ఏ పని చేసిచచ్చాడు గనక! నీలాంటి అందమైన అమ్మాయిని నిర్భయంగా — నేను మీవాణ్ణి ప్రేమించానూ అని చెప్పగలిగే ధీరోదాత్తురాలిని ప్రేమించానని చెప్పడానికే వాడు జడిస్తే ... రేపు నువ్వో నోరులేని పిల్లాణ్ణి కంటే వాడేం చెబుతాడూ అంట!

సుధ : క్షమించాలి. మా పరిచయం అంతవరకూ రాలేదు.

రంగారావు : సగం సంతోషం! పని పది వేలతో తెల్లారిపోతుంది!

సుధ : అంటే! ! ?

రంగారావు : సూటిగా చెప్పమంటావా? మావాడికి ఇప్పుడు ఎవరైనా పిల్లనిచ్చి ఇరవై వేల రూపాయల కట్నం ఇస్తామంటున్నారు. వాడికి ఇలాంటి లూప్ లైను సంబంధాలు ఉన్నాయని తెలిస్తే ఆ డిమాండు కాస్తా తగ్గిపోతుంది. కనక నీ వ్యవహారాన్ని పదివేలతో సెటిల్ చేసుకొని, కట్ షార్ట్ చేస్తే లాభసాటిగా ఉంటుంది అనుకుంటున్నాను.

సుధ : పెద్దవారు మీ రిలా మాట్లాడటం భావ్యం కాదు. రెక్కలు విచ్చుకునే వయసులో ప్రేమించి పెళ్ళి చేసుకోవడం తప్పంటారా? నచ్చిన వాడిని నమ్ముకునే స్త్రీని నట్టేటిలో ముంచటమే న్యాయమా? పెద్దలు చేస్తేనే గాని పెళ్ళి కాదా? పిన్నలు మనసులు ఏకం చేసుకుని మనువు సాగించాలనుకుంటే తప్పంటారా? అలా స్వతంత్రించినంతమాత్రాన వారిని వేరు చెయ్యాలని ఎందుకు ఊహిస్తారు? మీకుమాత్రం వయసులో మమతలూ, మధురిమలూ లేవా! ? ఆ నాడు మీ రిలాంటి అనుభవాలను ఎదుర్కొనలేదా...? గతాన్ని మరిచిపోతా రెందుకు?

# వెలుగు బాట

## శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

చెదరగొట్టిరి శత్రు సేనాధిపతుల సా
హస రూపిణులు భండనాంగణమున
అసువు లిచ్చిరి ప్రభుత్వోద్ధత్యమున కహిం
సా వ్రతుల్ భారత జననికొరకు
పరుగులెత్తిరి రాచ చెరసాలలను నింప
ప్రజలు స్వాతంత్ర్య పిపాసతోడ
వడిచి వచ్చిరి లతాంతపు దేహముల వసూ
ర్యంపశ్యలును కార్యరంగమునకు
దేశ మాతృ దాస్య తిమిర విచ్ఛేదన
దక్షమైన దివ్య దీక్షబూని;
వారి చరితలెల్ల స్వాతంత్ర్య రజతోత్స
వమున జూపు వెలుగు బాట మనకు ★

రంగారావు : ఆపు, అమ్మాయీ! ఆవేశ మెందుకు? నేను మీ ఇద్దరినీ విడిపొమ్మని సజెస్టు చెయ్యటం లేదే? మావాడి డిమాండ్ ఇరవై వేలు అంటున్నాను. ఆ మేరకు నీకుగాని, నీ కన్నవారికి గాని శక్తి ఉంటే...

సుధ : ప్రేమకు విలువ కడుతున్నారన్నమాట! మీ అబ్బాయి ప్రేమను ఇరవై వేలున్న ఏ ఆడదైనా కొనుక్కోవచ్చు నన్న మాట! ఆయనకూ, ఆయన వ్యక్తిత్వానికీ విలువే లేదా! ? తండ్రి అనే వర్తకుడు రేటు నిర్ణయించి విడిచిన వస్తువేనా పురుషుడు? రేటు పెట్టి, బోర్డు కట్టి అంగట్లో నిలబెట్టే బానిసల వ్యాపారం పూర్వం ఉండేదని చరిత్రలో విన్నాం. కాని, ఈనాడు కళ్ళారా చూస్తున్నాం!

రంగారావు : ఈనాడే కాదమ్మాయీ! అనాదినుంచీ ఈ దేశంలో ఉన్న లాభసాటి వ్యాపారం ఇదొక్కటే. కాకపోతే ఒకప్పుడు అమ్మాయిలను అమ్మేవారు. ఇప్పుడు అబ్బాయిలను అమ్ముతున్నాం. వాడ్డూ యూ సే!!

సుధ : మీరు పెద్ద వారు! మిమ్మల్ని ఎదిరించి మాట్లాడకూడదనే ఉద్దేశ్యంతోనే ఇక్కడకు వచ్చాను. కానీ, తప్పలేదు. నేను మీ అబ్బాయిని ప్రేమించాను. అతనినే పెళ్ళి చేసుకుంటాను! ! మీరు కోరిన ఇరవై వేలూ ఇవ్వలేను. మీరు అంగీకరించినా, అంగీకరించక పోయినా మా పెళ్ళి ఆగదు. కొద్ది రోజులలో రిజిస్ట్రారు ముందు మా వివాహం జరిగి తీరుతుంది.

రంగారావు : మావాడు అంగీకరించకపోతే?

సుధ : అంత వ్యక్తిత్వం లేని మనిషి కా దాయన! !

రంగారావు : గుడ్! ! అంత కాన్ఫిడెన్సు ఉంటే ఫర్వాలేదు. నాకే ఇంకా వాడిమీద అంత గురి కుదరలేదు. సరే! నువ్వు చెప్పాల్సింది అయిందనుకుంటాను. న న్నొక మాట చెప్పనిస్తావా? !

సుధ : చెప్పండి! !

రంగారావు : నేను వాడి తండ్రిని! నీ దృష్టిప్రకారం డీలర్ని!! వాడొక కమొడిటీ! నువ్వొక కస్టమర్‌వి! ! యాజ్ ఫర్ ఇకనామిక్స్ ఈ మూడింటికీ మధ్య నొక మీడియమ్ ఉండాలి. ఐ మీన్ మనీ! అది అక్కరలేదు అంటున్నావు నువ్వు! డబ్బుకు బదులుగా ప్రేమ పనిచేస్తుంది అంటావ్! ఆ ప్రేమతోనే మావాడు అనబడే వస్తువును కొనేస్తానూ అంటున్నావ్. బాగానే ఉంది. ప్రేమకు డబ్బుతో సంబంధం లేకపోవచ్చు. కానీ, బతుక్కి ఉంది. డబ్బు లేనిదే బతుకు లేదు! ఆ ఆర్థిక సత్యం తెలుసుకోలేకే నీలాంటి అమెచ్యూర్ ప్రేమికులు ప్రేమలో విజయం సాధించి, జీవితంలో ఓడిపోతున్నారు. ఇట్ మీన్స్ ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్! ! వాడ్డూయూ సే!!

సుధ : మీరు చెప్పినది యథార్థమే కావచ్చు. జీవించడానికి డబ్బు కావాలి కానీ, జీవితమే డబ్బు కాదు. అలా అయితే దొంగతనాలు, దోపిడులు, బ్లాక్ మార్కెట్ అన్నీ చట్టబద్ధం చెయ్యాలి. కాదంటారా! !

రంగారావు : నువ్వేమన్నా లా చదివి మానేశావా? నన్నడిగితే నువ్వు నా కోడలు పోస్టుకి కంటెస్టు చేసేకంటే రాజ్యసభ మెంబరుగా నిలబడిఉంటే బాగుండేది.

సుధ : మీరు జోక్ చేస్తున్నారు!

రంగారావు : బాగుంది! ఈ రోజుల్లో నిజం అనేది ఒక జోక్‌గా మారిపోయిందని నాకేం తెలుసు!! ఇంతకూ నీ నిర్ణయం మారదంటావు?

సుధ : మారదు!

రంగారావు : మావాణ్ణి చేసుకోక తప్పదు?

సుధ : తప్పదు! !

రంగారావు : సరే! చేసుకో!!

సుధ : ఆఁ!!

రంగారావు : అదేమిటి! ఇంతసేపూ నేను వద్దంటున్న కొద్దీ చేసుకుంటానన్నావు ఇప్పుడు చేసుకోమంటే తెల్లబోతావేం?

సుధ : మరి మీరు కోరిన ఇరవై వేల రూపాయలు?!!

రంగారావు : ప్రస్తుతానికి ఇవ్వద్దు!! పెళ్ళయ్యాక మనవడ్ని కని నాకు పారెయ్యండి. వాణ్ణి సలభై వేలకు అమ్మి వడ్డీతో కలిపి రాబట్టుకుంటాను. అప్పుడూ మళ్ళా ఏదైనా ప్రేమాయణం కథ చెబితే ఊరుకోను. ఆఁ ముందే చెప్పేస్తున్నా!!

సుధ : మీ రెంతో మంచివారు, మామయ్యా!! తొందరపడి మీ మనస్సు నొప్పించి ఉంటే క్షమించండి!

రంగారావు : ఇప్పుడు తీరిక లేదు. తరవాత క్షమిస్తాను. ప్రస్తుతానికి నువ్వెళ్ళు. ( సుధ వెళ్ళబోతుంది. ) ఆగు! ! మీ నాన్నగారి పేరేమిటన్నావ్!!

సుధ : ఆయన పోయి చాలాకాల మయిందండీ!

రంగారావు : పోనీ, మీ అమ్మగారు!!

సుధ : ఆమె నా చిన్నతనంలోనే పోయింది!

రంగారావు : మరి నువ్వూ?

సుధ : అనాథను! ! ఈ ఊళ్ళోనే అనాథ శరణాలయంలో పెరిగాను. ఆ సంస్థ వల్లే చదువుకున్నాను. ఈ నాటికి మీ దయవలన ఒక ఇంటిదానిని కాబోతున్నాను!

రంగారావు : నువ్వు అనాథవా? అయితే లోపలికి వెళ్ళు. ఇంకా మీ తల్లిదండ్రులతో చెప్పిరావడానికి వెళుతున్నావేమో ననుకున్నాను. ఎవరూ లేనిదానికి వీథిలోని కెందుకు? ఈ రంగారావు కోడలు వీథుల్లో తిరగటం సహించలేడు!

సుధ : ( నిండుగా నవ్వుతుంది. ) కాదు, మామయ్యా, ఆఫీసు కెళ్ళాలి.

రంగారావు : ఓహో! ఆఫీసుకా! ఆగు. వాడూ ఆఫీసేనంటూ పరుగెత్తాడు! నువ్వూ ఆఫీసుకే నంటున్నావు! చూడబోతే పెళ్ళయ్యాక మీ రిద్దరూ కాపురం ఆఫీసులోనే పెట్టేసేలా ఉన్నారు. అదేం వీలుపడదు.

సుధ : ( సిగ్గుపడుతుంది ) బాధ్యతలు ముందు కదా, మామయ్యా! తరవాతనే మిగిలిన విషయాలు. ఈ నాడు నా జీవితానికి తొలి పర్వదినం. ఈ నా అనాథ బ్రతుకులో తొలిసారిగా నా ఆత్మీయులు, నా వారు, నా ఇల్లు, నాచోటు అని చెప్పుకొనే అవకాశం కలిగిన మధుర క్షణం. ఆఫీసులో సెలవు పడేసి ఆలయానికి వెళ్లొస్తాను. మోడువారిన నా జీవితాన్ని తిరిగి చిగురింపజేసిన ఆ పరమాత్మని మనసారా ధ్యానించుకుని వస్తాను. అత్తగారికి పాదాభివందనం చేసుకుని ఈ రోజంతా ఇక్కడే ఉండిపోతాను...

రంగారావు : ఈ రోజంతా అంటున్నావు, ఈ రోజునుంచీ అను!

సుధ : ( తృప్తిగా నవ్వుతుంది. ) నేను వెళ్లొస్తాను, మామయ్యా!

రంగారావు : అలాగేనమ్మా. వెళ్లిరా! ( ఆమెను పంపిస్తూ వీథి ద్వారం వరకూ వెళతాడు. ) చాకులాంటి అమ్మాయి!! ఏమో అనుకున్నాను. మా వాడి సెలక్షను ఫర్వాలేదు. నిజానికి వాడికన్నా నయమే! చిన్న వయసులోనే జీవితాన్ని అర్థం చేసుకుంది. అయినా ఈ కాలం అమ్మాయిలకు ఈ వేగం ఎలా అలవడింది చెప్మా! ఇలా వచ్చి లైఫ్ సెటిల్ చేసుకుంది. అలా పోయి ఆఫీసులో కూర్చుంటోంది! మోస్ట్ అడ్వెంచరస్ గర్ల్!! ఒసేయ్! ఇదో, నా గొడవ ఏమైనా వినబడుతోందా?! హంపీ శిథిలం లాగు ఆ వంటింటి మూలలో ఏడవకపోతే ఇలా రారాదూ? ఏమిటీ ... వేపుడు మాడిపోతుందా! సరి, సరి అక్కడే ఉండు. నువ్విక్కడికొస్తే లైఫే మాడు కంపుకొడుతుంది. నీ తరం నుంచి కోడలి తరం వచ్చేసరికి స్త్రీ జీవితంలో ఎంత మార్పు! ఎంత పరిణామం!!! ఏమిటీ! ... బోధపడటం లేదా? సరేలే. నీకు బోధపడటానికి ఇదేమైనా పప్పు తాలింపా? పరిణామ సిద్ధాంతం నీ తాతల్లాంటి వాళ్ళకే తల కెక్కలేదు. సరే! నే నలా వీథిలోకి వెళ్లొస్తానుగానీ, ఇల్లు జాగ్రత్త!!

[ రంగారావు వీథిలోనికి వెళ్లబోతాడు. ఇద్దరు వ్యక్తులు ప్రవేశిస్తారు. ఇద్దరికీ మూతిని మీసాలు ఉండవు. ]

నిరాశ, దురాశ : నమస్కారమండీ!!

రంగారావు : ఎవరు, నాయనా, మీరు! ?

నిరాశ, దురాశ : కళా సేవకుల మండీ!!

రంగారావు : ఓహో! కళాసులా! ఎవరికొట్లో పనిచేస్తున్నారు? !

దురాశ : అయ్యయ్యో! కళాసులం కాదండీ! కళాసేవకులం.

నిరాశ : కళకు దాసులం!!

రంగారావు : కళా! ఎవ రావిడ? ఎక్కడుంటోంది? ఏం చేస్తుంటుంది? ఆవిడకు నాతో ఏం పని? !

నిరాశ : అయ్యయ్యయ్యో! నటసామ్రాట్ తండ్రిగారికే కళంటే తెలియదా? ఎంత ఆశ్చర్యం!!!

దురాశ : ఇది మరీ విడ్డూరము! చెప్పరా, నిరాశా!

నిరాశ : కళంటేనాండీ? కళంటే! కళా ... అదే కళ!

రంగారావు : ఆగండి! ముందు ఇది చెప్పండి! నటసామ్రాట్ అన్నారు. వా డెవడు?

దురాశ : అయ్యయ్యో! అది కూడా తెలియదా! ? అచ్చయ్యపేట పరిషత్తు నుంచి ఆంధ్ర నాటక కళా పరిషత్తు వరకు తన నటనా వైదుష్యంతో ఒక్క ఊపు ఊపి — నటసింహ! నట శేఖర!! నటసామ్రాట్!! అనిపించుకున్న రావుశ్రీ తండ్రిగారికి తన కుమారుడు అత్యంత ప్రతిభాశాలి అయిన నటుడని తెలియదంటే ఎంత శోచనీయమూ!!

నిరాశ : కాదురా! మన గురువుగారి నిరాడంబరత్వానికి నిదర్శనం!! ఈ హాలు చూశావా? ! ఇది ఒక నటుని ఇల్లంటే ఎవరైనా నమ్ముతారా? కనీసం పరిషత్తులో మెరిట్ సర్టిఫికేటు వచ్చిన వాడి ఇల్లు కూడా ఇలా ఉండదే... ఒక్క షీల్డు...

దురాశ : ఒక్క కప్పు!

నిరాశ : ఒక్క మొమెంటో ...

దురాశ : ఒక్క ఫ్రేము కట్టిన సన్మాన పత్రం...

నిరాశ : తారామణితో కలిసి తీయించుకున్న ఫోటో ...

దురాశ : ఏమీ లేవు!! ఓహో, గురువుగారూ! నిజంగా కళాకారులంటే మీరండీ!

నిరాశ : ఏమి మీ నిరాడంబరమైన కళాసేవ! నిస్స్వార్థ కళా దీక్ష!! ఇవే మీకు మా జోహార్లు. ( రావుశ్రీ ఫోటోకి డ్రమెటిక్‌గా నమస్కారం చేస్తారు. )

రంగారావు : ఏమిటీ! మా వాడు నాటకాల్లో వేషాలు వేస్తున్నాడా?

దురాశ : వేషాలు వేస్తున్నాడా? అయ్యయ్యో! ఏమిటండీ! ఆయన వేసేవి వేషాలా? సజీవ పాత్రలు!! గిరిశం నుండి గురవయ్యసెట్టివరకు ఆయన వెయ్యని పాత్ర లేదు. ఏ నాటకంలోనైనా బరువైన పాత్రలు ఆయనే ఎత్తుతారు.

నిరాశ : కాదు కాదురా ధరిస్తారు!!

దురాశ : ధరించీ వాటికి ప్రాణం పోస్తారు!

నిరాశ : వారికి ఈ ఊరంతా శిష్యులు! ఆంధ్రదేశ మంతటా అభిమానులు! అచిరకాలంలోనే ఆయన సినిమాల్లో ధ్రువతార!!

రంగారావు : మీరు కాస్సేపు ఆగుతారా?

నిరాశ, దురాశ : ఆగిపోయాం.

రంగారావు : మీరు వాడి శిష్యులా? !

దురాశ : అవును. వీడు నిరాశ!

నిరాశ : వీడు దురాశ!!

రంగారావు : అదేమిటీ!! నువ్వు పుట్టగానే మీ నాన్నకు నిరాశ, వీడు పుట్టేసరికి వీళ్ళ నాన్నకు దురాశ పుట్టుకొచ్చా యేమిటి? !!

నిరాశ : అబ్బా! గురువుగారి నాన్నగారూ! ఏం జోకు వేశారండీ!

దురాశ : అదీ రిహార్సల్సు లేకుండానూ ... గట్టివారే!!

నిరాశ : పొదుపంటే పేరులో పొదుపు!! నా పూర్తి పేరు నిడివి తక్కువ రామశర్మ. వాడి పేరు దూర్వాసుల రామచంద్ర శాస్త్రి! కళాకారుల పేర్లు కూడా కళాత్మకంగానే ఉండాలి కనక సింపిల్‌గా వాడు నిరాశ, నేను దురాశ. కాదు కాదు... వాడిది దురాశ, నాది నిరాశ!!

రంగారావు : అయితే ఎందుకొచ్చా రిక్కడికి!

నిరాశ : గురువుగార్ని ఆహ్వానించేందుకు! వారికి ఈ ఊరి క్లబ్బులో సాయంత్రం ఘనమైన సన్మానం ఏర్పాటు చేశారు!

రంగారావు : అలాగా!! నిజం... !!

దురాశ : అవును! రావుశ్రీగారు మొన్న కళా పరిషత్తులో ఉత్తమ నటుడుగా, ఉత్తమ దర్శకుడుగా బహుమతి నందుకున్న సంగతి మీకు తెలియదా? అందుకని! ! వారి గౌరవార్థం ఈ ఊరులో ఉన్న దజనున్నర కళాసమితు లన్నీ కలిసి పెద్ద సన్మానం ఏర్పాటు చేశాయి,

నిరాశ : వ్యవధిలేదు. గురువుగారికి వెంటనే ఈ సంగతి చెప్పి ఆయన అంగీకారం తీసుకోవాలి.

రంగారావు : మావాడి శిష్యులూ! నిజం చెప్పండి! ఈ సన్మానానికి మా వాడు ఎంత డబ్బిచ్చాడు? !

దురాశ : అయ్యయ్యో! అదేమిటి, సార్! గురువుగారు డబ్బివ్వట మేమిటి?

నిరాశ : ఇదేమన్నా కవిసన్మాన మనుకున్నారా? రాజకీయ నాయకుల విగ్రహాల స్థాప ననుకున్నారా?

దురాశ : మా కళాకారుల సమష్టి కృషి, ఒకరి ఎడల ఒకరికి ఉండే పరస్పర గౌరవం! సాయంత్రం మీరు కూడా సభకు దయచెయ్యాలి.

రంగారావు : సరేలే! నే నక్కడకు దయచేస్తే, వాడు వేదికమీద నుంచే దయ చేస్తాడు! ఎందుకుగాని వాడు ఆఫీసుకు వెళ్లాడు — అక్కడికి వెళ్లండి.

దురాశ, నిరాశ : వెళ్లొస్తామండి!

రంగారావు : ( వాళ్లు వెళ్లినవేపే చూస్తూ ) అమ్మా, కళామతల్లీ! వీళ్లతో ఎలా వేగుతున్నావో కదా! అయితే, మా వాడు ఇంత పకడ్బందీగా నాటకాలు ఆడుతున్నాడా? ! ఇక లాభం లేదు. ఇలా ఊరుకుంటే ఇంకా ఎన్నో నాటకాలాడేస్తాడు. ( గబగబా పెరటి ద్వారం వద్దకు వచ్చి ) ఒసేవ్... ఇదో ... ( తొంగిచూస్తాడు. ) ఓహో! వంటింట్లోనే నిద్దరో తున్నావా? సర్లే !! ( వీథిలోనికి పోతాడు. కొద్ది క్షణాల్లో రావుశ్రీ విసుగ్గా ప్రవేశిస్తాడు. )

రావుశ్రీ : అబ్బబ్బ! అనుకున్న పని అనుకున్నట్టు చెయ్యాలంటే సవాలక్ష అభ్యంతరాలు! హక్కు ఉన్న సెలవు ఇవ్వటానికి కూడా ఆఫీసులో ఏడుపే— వీళ్ల తాతగారి ముల్లె మంజూరు చేస్తున్నట్టు! వెధవది సన్మానం కూడా ఈవేళే తగలెట్టారు! లేకపోతే మరో చిన్న నాటకం ఆడేసినట్టయినా కథ క్లయిమాక్స్‌కి రీచయిపోయి, తెర దించే వేళకు సుఖాంతమైపోను. పూర్ క్రీచర్ గిరీశం అన్నట్టు కొంపదీసి కథ అడ్డం తిరగదు కదా!
( సుధ ప్రవేశిస్తుంది. )

సుధ : తిరిగినా, నటకాగ్రేశ్వరులు మీరు తిరగనిస్తారా? !

రావుశ్రీ : ఓ ... మై ఫెయిర్ లేడీ! నువ్విక్కడే ఉన్నావా? నేను చెప్పిన పని చేశావా?

సుధ : చెయ్యడమేమిటి విక్టరీ సాధిస్తేను! మామయ్య గారు మన పెళ్లికి అంగీక రించారు.

రావుశ్రీ : నిజమా?

సుధ : ఎస్. ఆ సంగతి చెప్పడానికే సెలవుపెట్టి మీ ఆఫీసు కొచ్చాను. నాకంటే ముందే సెలవు పెట్టి తమ రెక్కడికో చెక్కేశారు.

రావుశ్రీ : కంగ్రాచ్యులేషన్స్! నేను చెప్పలేదూ, నాన్నగారికి బాధ్యతలు తెలిసి ఉన్న మాట మొహం మీద చెప్పే వాళ్లంటే చాలా ఇష్టమనీ!

సుధ : నిజమే! ఆయ నలాంటి వారు తండ్రిగా లభించడం నిజంగా మీ అదృష్టం!

రావుశ్రీ : అంతవరకూ అదృష్టమే. కానీ, ఆయనకు నాటకాలంటే ఇష్టంలేదు. కొంపదీసి నువ్వు నాటకాల్లో నటిస్తావని చెప్పలేదు కదా?

సుధ : చెప్పలేదు! కానీ, ఇక మీదట నేను నాటకాలు మానేద్దామనుకుంటున్నాను. మామయ్య చెప్పినట్టు నడుచుకుంటేనే మంచిది. ఎందుకొచ్చిన నాట కాలు? డబ్బు ఖర్చుపెట్టి, ఆరోగ్యం పాడుచేసుకొని పరిషత్తుల వెంబడి ప్రాకులాడటం, వారికి దయ పుట్ట [illegible] పెట్టి మురిసిపోవడం—ఇంతేగా మనం సాధించేది!

రావుశ్రీ : చచ్చాం పో! అరగంట నాన్నగారితో మాట్లాడావో లేదో అప్పుడే ఆయన పక్షాన చేరిపోయావ్! ఏదీ గతి నాకూ ... ( రాగయుక్తంగా ఆలపించి కూలబడిపోతాడు. )

ఇదుగో, అమ్మాయ్! మన ఒప్పందం ఏమిటి? ! నువ్వు నాటకాల్లో నటిస్తావనేగా పెళ్లికి ఒప్పుకున్నాను? లేడీ ఆర్టిస్ట్ కిరాయి ఉండదనేగా నిన్ను ప్రేమించింది? అసలు నా నాటకాలు చూసే కదా నువ్వు నన్ను ప్రేమించింది? మరి ఇప్పు డీ నాడు పెళ్లి కుదిరిపోయిందని అపోజిషన్ పార్టీలో చేరిపోవడం న్యాయమేనా ? ! కలెక్ట రాఫీసులో క్లైవు కొట్టుకునే దానివి నీ నోట డైలాగులు పలికించడానికి నేను పడ్డ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరేనా? నా కళా ప్రగతికి అడుగడు గునా ఆటంకాలేనా? !

సుధ : అబ్బబ్బా! ఊరుకుందురూ! ఎప్పుడూ మీ నాటకం డైలాగులూ మీరూనూ! ఎవరైనా వింటే నవ్వుతారు కూడాను. మీ బాధ పడలేక ఆ డైలాగులైనా నేర్చుకున్నాను. ఎవరికీ తెలియకుండా మీ వెంట పరిషత్తుల కొచ్చాను. మిమ్మల్ని ప్రేమించిన నేరానికి ఈ పాట్లు చాలు, బాబూ! ఇంకా పెళ్లయిన తరవాత కూడా నన్ను పరిషత్తుల వెంబడి తిప్పుతారు కాబోలు! మామయ్య అసలే అభిమానం కలవారు! న న్నసలు ఉద్యోగం కూడా చెయ్యనియ్యరేమో?

రావుశ్రీ : ఇదిగో, అమ్మాయీ! నీ అవసరం తీరిపోయింది కదా అని ప్లేటు ఫిరా యించడం న్యాయంకాదు. ఆయనమాత్రం నాటకాలు ఆడటంలేదా? బోలెడంత ఆస్తి పెట్టుకొని ఏమీ లేని వాడిలాగు నా చేత ఉద్యోగం చేయిస్తున్నారు. నా జీతం మీదే ఆధారపడి ఉన్నట్టు నాటక మాడు తున్నారు. లేకపోతే నేను నాటకాలు ఆడటం ఏం ఖర్మ! పెద్ద కళా పరిషత్తే కండక్టు చేసేవాణ్ణి.

సుధ : ఆఁ ఆఁ ... తమ రంతటి ఘనమైన వారని తెలిసే ఆయ నలా దాచిపెట్టి ఉంటారు.

రావుశ్రీ : సరే, ఇంతకూ ఏమంటావ్! మరి నాటకాల్లో వేషాలు వెయ్యవ్. అంతేనా? ! నిన్ను నేను చేసుకోను. టిట్ ఫర్ టేట్!

సుధ : ఆ పప్పులేం ఉడకవ్! స్వామీ! నేనేం పతివ్రతల కాలంనాటి పాపాయిని కాను. ముక్కు పిండి మరీ పెళ్లాడుతాను. అట్టే మాట్లాడితే మీ నాటకాల సంగతి ఆయనతో చెప్పి ...

రావుశ్రీ : సుధా! సుధా!! అంతపని చెయ్యకు! ( దగ్గరగా వెళ్లి ఆమె గడ్డం పట్టు కొని బతిమిలాడుతాడు. వీథిలో ఎవరో వస్తున్న అలికిడవుతుంది. )

సుధ : అబ్బ, వదలండీ! ఎవరో వస్తున్నారు.

రావుశ్రీ : చచ్చాం! నాన్నగారేమో! ? ఇప్పుడెలా? నువ్వు చప్పున వెళ్లిపో !

సుధ : భయంలేదు లెండి! మామయ్య ఇందాకే నన్ను ఇంట్లో ఉండిపొమ్మన్నారు.
( లోనికి చనువుగా వెళ్లిపోతుంది. )

రావుశ్రీ : ఆఁ ... లైసెన్స్ తోపాటు రూటు పెర్మిషను కూడా సంపాదించేశావా? హాతోస్మి !! ( గబగబా టేబుల్ దగ్గరకు పోయి ఏదో ఫైలు వెతుకు తున్నట్టు నటిస్తాడు. )

[ వీథిలోంచి యోధనాథం ప్రవేశిస్తాడు. మనిషి గంభీరంగా ఉంటాడు. చూడగానే మొండివాడిలా కనిపిస్తాడు. రావుశ్రీని గమ నించడు. హాలు మధ్య నున్న కుర్చీలో కూర్చుని సిగరెట్ ముట్టిస్తాడు. అంత చొరవగా ఇంట్లో ప్రవేశించిన క్రొత్త వ్యక్తి ఎవరో తెలియక రావుశ్రీ ముందుకొస్తాడు. ]

రావుశ్రీ : ఎవరండీ మీరు?

యోధనాథం : అపరిచితుణ్ణి!! కాని, మీరు నాకు చిరకాల పరిచితులు.

రావుశ్రీ : మీరు నాటకాల్లో వేషా లేస్తూంటా రనుకుంటాను.

యోధనాథం : నాటకాల్లో చాలా వేషాలు వేశాను. కానీ, జీవితంలో వేషాలు వెయ్యడం ఇంకా చేతకాలేదు.

రావుశ్రీ : ( అనుమానం వేస్తుంది. ) ఇక్కడకు రావడంలో మీ ఉద్దేశ్యం?

యోధనాథం : ఆ విద్య నీ దగ్గర నేర్చుకుందామనీ! !

రావుశ్రీ : హేళన చేస్తున్నారా? మీ ఉద్దేశ్యం!!

యోధనాథం : నీకు అర్థంకాదులే, కూర్మనాథరావ్! ఐ మీన్ ... రావుశ్రీ!

అంత తొందరగా అర్థమయితే నువ్వు నటుడి వెలా అనిపించుకుంటావ్! ( సిగరెట్ నేలకేసి కొడతాడు. ) మనస్సు అద్దంలా నిర్మలంగా ఉంటే ఎదుటి వ్యక్తుల ప్రతిబింబాలు యథాతథంగా కనిపిస్తాయి. కాని, కొందరి జీవితాలు గాజు పలకలు. ఎదుటి వస్తువును ప్రతిఫలించవు సరికదా, ఆకారాలనే మార్చి చూపిస్తాయి. అర్థం కాలేదు కదూ? బహుశా చిన్నతనంలో నేర్చిన సైన్సు పాఠాలు మరిచిపోయి ఉంటావు. పోనీ, ప్రకృతి శాస్త్రం గుర్తుందా?

రావుశ్రీ : మీ ధోరణి ...

యోధనాథం : నాటకంలోలా ఉంది కదూ! భయపడకు. నేను నాటకంలో వేషం అడగటానికి రాలేదు.

రావుశ్రీ : అసలు ఎందుకొచ్చా రిక్కడికి?

యోధనాథం : ( క్షణం ఆగి ) వసంతం వచ్చిందని చెప్పడానికి!!

రావుశ్రీ : ( త్రుళ్లిపడతాడు. ) ఆఁ!!

యోధనాథం : అలా ఆశ్చర్యపోతావేం? వసంతం ప్రతి సంవత్సరానికీ ఒక సారి వస్తూ ఉంటుంది. వచ్చినప్పుడల్లా రెండు నెలలు ఉంటుంది.

రావుశ్రీ : మీరు మాట్లాడేది ఏ వసంతం గురించి?

యోధనాథం : గుడ్! ( విపరీతంగా నవ్వుతాడు. ) బ్రహ్మాండమైన జోక్ వేశారు. ఆఁ!! ప్రపంచమంతటికీ ఉండేది ఒకటే వసంతం. మీకు మాత్రం చెందిన వసంతం వేరొకటి ఉందన్న మాట.

రావుశ్రీ : ( తడబాటుతో ) అబ్బెబ్బె! నా ఉద్దేశ్యం అది కాదు. మీరు మాట్లాడేది మామూలు వసంతాన్ని గురించేనా అని !!

యోధనాథం : అవును. మామూలు వసంతం గురించే. జీవితంలో ఉండే సర్వశోభల్నీ నీలాంటి వంచకుల చేతిలో పెట్టి, నలిగి నాశనమైపోయిన మామూలు వసంతం గురించే మాట్లాడుతున్నాను.

రావుశ్రీ : మీరు అతిగా మాట్లాడుతున్నారు.

యోధనాథం : అవును. అతిగానే మాట్లాడుతున్నాను. మితం తప్పిన వ్యవహారాలు శ్రుతిగా ఉండవు, రావుశ్రీ! నమ్మిన ఆడదాన్ని నట్టేట్లో ముంచి, నిమ్మకు నీరెత్తినట్లు ఈ ఊరు వచ్చినంత మాత్రాన జరగబోయే కథ నిలిచిపోతుం దనుకున్నావా? ఆడదాని జీవితంతో ఆటలాడి పారిపోవడం అంత తేలికనుకున్నావా? నెవ్వర్! నెవ్వర్, రావుశ్రీ!!

రావుశ్రీ : నేనేం పారిపోలేదు. మా నాన్నగారి ఆస్తి అప్పుల వాళ్ల పరం కావటంతో పువ్వులమ్మిన చోట కట్టె లమ్మలేక ఇలా ఈ ఊరు వచ్చాం.

యోధనాథం : ఈ కథ నువ్వు నమ్మే చెబుతున్నావా? నన్ను నమ్మమని చెబుతున్నావా? మీ నాన్నగారికి ఎంత ఆస్తి ఉందో బ్యాంక్ అకౌంట్ చెబుతుంది, రావుశ్రీ! ఒకరి కళ్లు మూసినంతమాత్రాన లోకమంతా చీకటి కాదు. అందర్నీ కొంతకాలం మోసం చెయ్యగలవ్. కొందర్ని అంతకాలమూ మోసం చెయ్యగలవ్. కానీ, అందర్నీ అంతకాలమూ ఎవ్వరూ మోసం చెయ్యలేరు. ఆస్తి లేకపోతే మాత్రం ఏమీ తెలియని అమాయకురాలిని వంచించి ఆమె సర్వస్వాన్ని దోచుకుని పోతావా? ఆశ పెట్టి మోసం చేస్తావా?

రావుశ్రీ : అబద్ధం! వసంతాన్ని నేనెప్పుడూ మోసం చెయ్యలేదు. ఏ విధమైన ఆశా పెట్టలేదు.

యోధనాథం : అబద్ధం! ఏది అబద్ధం? చదువుకుంటున్నదాన్ని నాటకాల మోజులోకి లాగి రంగస్థలం ఎక్కించడం అబద్ధమా? తల్లిదండ్రులకు తెలియకుండా పరిషత్తుల వెంబడి తిప్పడం అబద్ధమా? అమాయకురాలిని మోసగించి కన్నవారి నుండి దూరం చెయ్యడం అబద్ధమా? ! ...

రావుశ్రీ : తలిదండ్రుల నుంచి వేరు కమ్మని నేను చెప్పలేదు. కళావ్యాసంగానికి అడ్డమొస్తున్నారని తనే వేరయిపోయింది.

యోధనాథం : తెలివిగా మాట్లాడుతున్నా ననుకున్నావా! ఆమెలో ఆ పిచ్చి రేపిం దెవరు—నువ్వు కాదూ? ఇల్లూ, స్కూలూ తప్ప రెండో విషయం తెలియనిదానికి అంత ధైర్యం ఎలా వచ్చింది? నువ్విచ్చిన ధైర్యం కాదూ! ఎవరు ఏం చెప్పినా విననంతటి మొండితనం దానికెలా వచ్చింది? నువ్వు పెళ్లిచేసుకుంటావని హామీ ఇవ్వటం వల్ల కదూ?

రావుశ్రీ : అన్యాయం! అన్యాయం!! వసంతాన్ని పెళ్లిచేసుకుంటానని నే నెప్పుడూ చెప్పలేదు.

యోధనాథం : అవును. నువ్వు చెప్పలేదు. కానీ, ఆశలు కల్పించావు. నువ్వు కొన్ని ఆశలు కల్పిస్తే అది మరికొన్ని ఊహించుకొంది. ఫలితంగా దాని జీవితం రెంటికీ చెడ్డ రేవడిలా—అందరూ ఉండి అనాథగా తయారైంది.

రావుశ్రీ : అందుకు బాధ్యత నాదికాదు. తన చేతులారా తానే భవిష్యత్తు పాడుచేసుకొంది. శ్రమపడి నటిగా తీర్చిదిద్దిన నన్ను కాదని పరాయి వాళ్లతో నటించింది. నాకు తెలియకుండా ఎన్నో సమాజాలకు కాంట్రాక్టు లిచ్చి, పరిషత్తు వేళకు నన్ను మోసగించింది. చివరకు నాకు మొహం చూపించలేక ఇంట్లో ఉండి కూడా లేదనిపించింది. చివరకు డబ్బుకు కక్కుర్తి పడి పవిత్రమైన కళకు ద్రోహంచేసి శీలాన్ని అమ్ముకుంది.

యోధనాథం : నోర్మూయ్. ఎవరు శీలాన్ని అమ్ముకున్నది? నువ్వు! నీ చుట్టూ తిరిగే వాళ్లకు ఆశలు కల్పించి, వారి సహాయంతో పెద్దవాడివై మహా నటుడుగా చెలామణీ అవుతున్న నువ్వా శీలాన్ని అమ్ముకునేది. ఆడదైనా నీకోసం కన్నవారిని కాదంది. అభిమానవతి గనక నువ్వు నిరాదరించినా, నీ పేరుతోనే బ్రతుకును వెళ్లదీస్తోంది. నువ్వు ఆదరించకపోతే ఇతరులతో నటించక ఏం చేస్తుంది? ఆప్తులందరికీ దూరమై అధోగతి పాలయిన ఆడది అంతకన్న ఏం చెయ్యగలుగుతుంది? మాట్లాడవేం!! దాని గతి ఏం చెబుతావ్?

రావుశ్రీ : న న్నేం చెప్పమంటావ్! ఇంతవరకూ నన్ను కాదని ఎలా బ్రతికిందో అలాగే బ్రతకమను.

యోధనాథం : మామూలు మనిషైతే అలాగే బ్రతికేది. నీలాంటి విశ్వాసఘాతుకుల గుమ్మం కూడా తొక్కేది కాదు. కానీ, ఇప్పు డది గర్భవతి.

రావుశ్రీ : ఆఁ!

యోధనాథం : అవును. నీ పాప భారాన్ని మోస్తున్న నిండు చూలాలు.

రావుశ్రీ : మిస్టర్! మర్యాదగా మాట్లాడు. కుక్క ముట్టిన కుండను నాకు అంటగట్టాలని చూస్తున్నావా?

యోధనాథం : ఏం కూశావ్!! ( ఆవేశంతో రావుశ్రీ పీక పట్టుకుంటాడు. సుధ ప్రవేశిస్తుంది. )

సుధ : ఎవరు మీరు! ? ఏమి టీ దౌర్జన్యం!!

యోధనాథం : ఓహో, క్రొత్త హీరోయిన్ గారా! నిన్ను చూసుకొనేనా ఈయన గారి కింత పొగరు! నీ రాణివాసం ఎంతకాలమో చూస్తానుగా!!

సుధ : ఏమిటి మీరు మాట్లాడేది? !

యోధనాథం : నీ భవిష్యత్తు!! నీలాగే ఈ మహానటుణ్ణి నమ్మి చెడిపోయిన ఒక అభాగ్యురాలి జీవితం నేర్పిన గుణపాఠం!!

సుధ : ( ఆశ్చర్యంతో ) అభాగ్యురా లేమిటి! చెడిపోవడ మేమిటి?!

యోధనాథం : చెప్పమంటావా? ఏం చెప్పనా, రావుశ్రీ! నీవు జీవితంలో ఆడే విషాదాంత నాటకాల పుటలు తెరిచి చూపించమంటావా?

రావుశ్రీ : ( తల వాల్చుకుంటాడు. )

యోధనాథం : తల వాల్చుకుంటావేం ఆడదానిలా! చూశావా, రావుశ్రీ! కాలం ఎదురు తిరిగితే ఎంతటి మహానుభావులైనా ఆడదాని ముందు, అదీ అత్యంత దయనీయమైన స్థితిలో తల వంచవలసి వస్తుంది. ఈ విషయం నీకు ఆ నాడు స్ఫురించి ఉండదు. ఈ స్థితి వస్తుందని కలలో కూడా ఊహించి ఉండవ్. ఏం చేస్తాం! కథ అంతానికి ముందు మలుపు తిరక్క తప్పదు.

సుధ : ఇంతకూ అసలు విషయం చెప్పండి!!

యోధనాథం : ఈ మహానుభావుడు నా చెల్లెల్ని నాటకాల మోజులోకి లాగి దాని బ్రతుకును బుగ్గిలో కలిపాడు. ఆకాశ హర్మ్యాలు ఆశ చూపించి ఆ అమాయకురాలి శీలాన్ని హరించాడు.

రావుశ్రీ : అబద్ధం! అంతా అబద్ధం!! ఇతని మాటలు నమ్మకు, సుధా!!

(తరువాయి 102 వ పేజీలో)

## నాటకాల రాయుడు

(79 వ పేజీ తరువాయి)

యోధనాథం : రావుశ్రీ !!! ఆడది కదా అని బుకాయించకు! ఆధారాలతో సహా నీ బ్రతుకును వీధుల్లో పెట్టగలను. ( జేబులోంచి వసంతం ఫోటో తీస్తాడు.) ఈ అమాయకురాలి మొహం చూచి చెప్పు— ఎరగనంటావా ఈమెని?

సుధ : (మధ్యలో ఆ ఫోటో అందుకుని చూస్తుంది. ఆశ్చర్యంతో నిలుచుండి పోతుంది. )

యోధనాథం : ఏం అలా చూస్తున్నావ్! ఎక్కడన్నా చూసినట్టుందా?

సుధ : అవును. ఎక్కడో చూశాను!!

యోధనాథం : చూసే ఉంటావు! ఈ మహా నటుడితో చాలా రంగస్థలాలు ఎక్కింది!

సుధ : అవును!! ఈమే!! నేనూ చూశాను!! ( రావుశ్రీని చూసి ) మీ రింత మోసగాళ్లనుకోలేదు. మీ తీయని మాటల వెనక ఇంతటి కాలకూటం పేరుకొని ఉంటుందని, మీ అందం వెనక అనంతమైన పాప పంకం నిండి ఉందని ఊహించలేకపోయాను. నిండా మునగక ముందే మీ నిజ స్వరూపం బయటపడటం నా అదృష్టం, సెలవ్. ఇకనైనా ఆడవారి జీవితాలతో ఆడుకోకండి. వారి ఆత్మలు పెట్టే ఘోష మిమ్మలను తప్పక అణిచివేస్తుంది. అధోగతిపాలు చేస్తుంది. ( యోధనాథంతో ) సరి అయిన సమాయానికి వచ్చి నన్ను రక్షించారు. మీ ఉపకారానికి తొందరలోనే ప్రత్యుపకారం చేస్తాను. ( చరచరా వెళ్లిపోతుంది. )

రావుశ్రీ : సుధా! సుధా!! నా మాట విను!!

సుధ : ఇంకేం చెప్పక్కరలేదు. నా కంతా బోధపడింది. ఏది ఎలా పరిష్కరించాలో నాకు బాగా తెలుసు. (వెళ్లిపోతుంది. )

యోధనాథం : ( విపరీతంగా నవ్వుతాడు. ) ఏం రావుశ్రీ! కథకు మధ్యలోనే తెర పడిపోయిందని విచారిస్తున్నావా? ఈ విషయం మీ నాన్నగారికి తెలిసి నువ్వు పూర్తిగా మునిగిపోక ముందే మేల్కోవడం మంచిది.

రావుశ్రీ : (పిచ్చిగా అరిచి కుర్చీని గట్టిగా కొడతాడు.) ఏంచేయ్యమంటావు నన్ను?

యోధనాథం : గుడ్! అలా రా దారికి. నిన్నూ, నీ జీవితాన్నీ నాశనం చెయ్యడం కాదు నా ఉద్దేశ్యం, రావుశ్రీ!

రావుశ్రీ : ఇంకెలా నాశనం చెయ్యాలి! చాలదా ఇది? !

యోధనాథం : నో, నో, నో!! ఇది పెద్ద నష్టమేం కాదు, రావుశ్రీ! జీవితంలోంచి ఒక ఆడది తప్పుకుంటే ఆ స్థానంలో మరొక ఆడది వస్తుంది! కానీ, మీ నాన్నగారి లక్షలు ఏదో చిన్న కారణానికి నీ నుంచి తప్పుకుంటే ... ఎంత ట్రాజడీయో ఆలోచించావా? !

రావుశ్రీ : లక్షలు! లక్షలు!! అప్పులపాలై ఆయనేడుస్తూంటే !!

యోధనాథం : హౌ పూర్ యూ ఆర్! నాటకాలు వేస్తుంటే నువ్వేదో తెలివైన వాడి వనుకున్నాను. మీ నాన్నగారి పేర బాంకులో రెండు లక్షల చిల్లరకు అకవుంటుంది!

రావుశ్రీ : నిజమా! నీ కెలా తెలుసు?

యోధనాథం : నాకు ఇంకా చాలా విషయాలు తెలుసు! ఆ డబ్బులో ఒక పదివేలు నా ముఖాన పారవేయ్ వసంత మళ్లీ నీ జోలికి రాకుండా చేస్తాను. అసలు దాని పేరే నీ చరిత్ర నుండి తప్పిస్తాను.

రావుశ్రీ : అంత డబ్బు నే నెందు కివ్వాలి! ఏ నేరం చెయ్యని దానికి నే నెందుకు నష్టపోవాలి? !

యోధనాథం : నేరం చేసినా, చెయ్యకపోయినా ఆ రెండు లక్షలూ నీకు మిగలాలీ అంటే ఇవ్వక తప్పదు! లేదా — తెల్లవారేసరికి వసంతం కోడలుగా ఈ ఇంట్లో అడుగు పెట్టుతుంది!

రావుశ్రీ : వీల్లేదు! వీల్లేదు!! అలా ఎన్నటికీ జరగటానికి వీల్లేదు.

( నిరాశ, దురాశ ప్రవేశిస్తారు. )

నిరాశ : అరెరే!! వీల్లేదూ అంటే ఎలా, గురువుగారూ! ఏర్పాట్లన్నీ పూర్తయి పోయాయి. మీరు అనుమతించడమే తరువాయి.

దురాశ : మీకోసం ఊరంతా తిరిగాం. ఇంట్లో లేరు, ఆఫీసులో లేరు. ఇక్కడి కొస్తే ...

నిరాశ : అక్కడి కెళ్లారు!

దురాశ : అక్కడి కెళితే ...

నిరాశ : ఇక్కడి కొచ్చారు!!

రావుశ్రీ : అబ్బబ్బ, ఉండండిరా!

నిరాశ : ఎలా ఉండమంటారు, గురువుగారూ! ఇంకా పనులు చాలా ఉన్నాయి. ముందు మీరు అనుమతించండి. తరవాతి సంగతి మేం చూసుకుంటాం.

దురాశ : మాకోసం కాకపోయినా, ఎన్నడూ కలవని నాటక సమాజాలన్నీ కలిసి చేస్తున్నందుకైనా మీరు అంగీకరించి తీరాలి.

నిరాశ : ( రావుశ్రీ ముఖాన్ని పరిశీలనగా చూస్తాడు. ) ఏం గురువుగారూ! మూడ్సు ఆఖరి సీన్లో లాగున్నాయి. ఏదన్నా ట్రాజడీ నాటకం ఎత్తుకున్నారా?

దురాశ : అదేరా నే నింకా పోల్చలే! టోన్ కూడా బేస్ వాయిస్‌లో పెట్టేశారు! హాయ్ హాయ్, నాయకా!

నిరాశ : గుర్గారూ! గుర్గారూ! నా కందులో తప్పకుండా వేషం ఇవ్వాలి, సార్!

దురాశ : నాక్కూడా! ( అప్పుడు యోధనాథాన్ని చూస్తాడు.) ఏయ్! ! ... యో ... ధనాథన్ రావ్! ఎప్పుడొచ్చావ్!!

యోధనాథం : ( చిరాకుగా ) ఎవరు నువ్వు!!

దురాశ : అదేమిటి, గురూ, అప్పుడే మరిచిపోయావ్! ఈ మధ్య నీ కేమయినా ఆక్సిడెం టయిందా! వీడి పేరు నిరాశ, నాది దురాశ ... అప్పాపురం పరిషత్తు! మేం పెరట్లో ప్రేమ నాటకం తీసుకొచ్చాం కదూ? అప్పుడు నువ్వు అమ్మణ్ణి తీసుకొని రాలే !!

నిరాశ : ఆ నాటకంలోనే కదా నేను నవ్వుతూ డైలాగ్ చెబుతూ ఉంటే ఆడియన్సు ఏడుస్తూ లేచిపోయారు!

దురాశ : అమ్మడు బాగుందా!

రావుశ్రీ : అమ్మ డెవరు? !

నిరాశ : అదే, గురూ, హీరోయిను! వాళ్లీ మధ్య నాటకాని కొక పేరు మార్చేస్తున్నారుగా? అందుకని టోటల్‌గా హీరోయిన్లందరికీ కలిపి ఒకటే పేరు ... అమ్మడు! బాగుందా?

రావుశ్రీ : ఇతను మీకు తెలుసా? !

నిరాశ : తెలుసా ఏమిటి, సార్! మీరు ఈ ఊరికి రాకముందు ఇక్కడ మా కో కళాసమితి ఉండేది. ఏమిట్రా దాని పేరు!!

దురాశ : కట్ షార్ట్ ఆర్ట్స్ సమాఖ్య!!

నిరాశ : ఆఁ. అదీ పేరు! రెండున్నర గంటల నాటకమైనా మేం వేస్తే గంటన్నరే వచ్చేది. అంత ప్రాంప్ట్‌గా వేసేవాళ్లం. అప్పుడు ఈయనేగా మా హీరోయిను సప్లయరూ!

యోధనాథం : నోరుముయ్యండి! మీరెవరో నాకు తెలియదు! ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నారు!!

నిరాశ : అదేమిటి, గురూ! అంత వేగం మరిచిపోయావేం!

దురాశ : సినిమాల్లో లాగ!!

## గాంధీ సూక్తులు

### మనం

భూతకాలం మనదే. కాని, మనం భూతకాలానికి చెందినవాళ్ళం కాము. వర్తమానానికి చెందినవాళ్లం, భవిష్యత్కాలాన్ని సృష్టించేవాళ్లమే కాని, భవిష్యత్కాలానికి చెందినవాళ్ళం కాము.

* * *

### త్యాగం

త్యాగమే సత్యమైన భోగం.

విరాశ : అరవై ఎనిమిది ఆగస్టులోనేగా మేం నాటకం వేసింది?

దురాశ : సెప్టెంబరులో ట్రూపు విడిపోయింది?

విరాశ : అందు క్కారణం అమ్మడేగా! అమ్మడేమో హీరోని ప్రేమించింది. డైరెక్టరేమో అమ్మణ్ణి ప్రేమించాడు. ప్రొడ్యూసరేమో వీళ్లిద్దర్నీ కాదని అమ్మణ్ణి డబ్బుతో తనవేపు లాగేసుకున్నాడు. దానితో ముగ్గురూ గుద్దుకుని, మూడు ట్రూపులుగా విడిపోయారు. ఆ మూడు ఇప్పుడు పదమూడయ్యాయి. ఇంత ఇంప్రూవ్‌మెంటూ అమ్మడి వల్లేగా!

దురాశ : అల్లాంటిది మేం ఎల్లా మరిచిపోతాం, గురూ రూ!

రావుశ్రీ: ఏం!! ఇప్పుడు దీనికేమంటావ్, యోధనాథరావ్! ఇంతసేపూ వసంతం పాతివ్రత్యం గురించి లెక్చర్లిచ్చావ్! నీ చెల్లెలనీ, అనాథై అలమటి స్తోందనీ!! పదివేలు కావాలనీ!!! ఇప్పుడు తెల్లబోతావేం ? అనుకున్న నాటకం అనుకున్నట్లు జరగలేదనా!

యోధనాథం : రావుశ్రీ! ఈ యోధనాథం ప్లాను వెయ్యటంలోనే కాదు, పని జరిగించుకోవటంలో కూడా యోధనాథమే! తెల్లవారేలోగా ఆ పదివేలూ ఇవ్వకపోతే ... వసంతం, నువ్వూ కలిసి తీయించు కున్న ఫోటోలతో సహా తాటికాయలంత అక్షరాలతో పేపర్లో పడుతుంది. నీ బ్రతుకు బజార్న పడుతుంది!

విరాశ : పదివేలూ ... ఏమిటి, గురువుగారూ! ఏదన్నా బ్లాకుమెయిలింగా?

దురాశ : వెనక మా ప్రొడ్యూసరు రామానుజా న్నిలాగే ...

యోధనాథం : నోర్మూయ్!! ఒక్కటి తగల్నిచ్చానంటే ఎక్కడి కెళతావో తెలుసా!...

రంగారావు : ( తాపీగా ప్రవేశిస్తాడు. ) వాడు ఆసుపత్రికి! నువ్వు పోలీసు స్టేష నుకి!! ( అందరూ ఆశ్చర్య పోతారు. రావుశ్రీ బిక్కచచ్చిపోతాడు. ) ఏం, అందరూ అలా ఆశ్చర్యపోతున్నారేం? ! కొట్టుకుంటే దెబ్బలు తిన్న వాడు ఆసుపత్రికి, కొట్టిన వాడు స్టేషనుకీ కాక ఇంకెక్కడికి పోతారు? ! ( అందర్నీ చూచి ) ఆఁ ఏమిటీ సీక్వెన్సు!! ఏమిరా, కుమారశ్రీ, రిహార్సెల్సు ఇంట్లోనే పెట్టేశావా?! ఊళ్లో సన్మానం, ఇంట్లో రిహార్సెల్సు!! ఏమిరా నీ కళా దీక్ష!! ( యోధనాథాన్ని చూసి ) ఈయ నెవరు—మీ నాటకంలో విలనా?! పెర్సనాలిటీ బాగుంది. ఏ ఊ రబ్బాయ్ మనది!

రావుశ్రీ : ( కంగారుగా ) నాన్నా! ... ఆయన ...

రంగారావు : ను వ్వాగరా, నాయనా! ఏం, అబ్బాయీ, ని న్నెప్పుడూ ఈ ఊళ్లో చూసినట్టు లేదే!

యోధనాథం : మాది ఈ ఊరు కాదండీ! మీ అబ్బాయితో ఒక వ్యవహారం పరిష్కరించుకుందామని వచ్చాను.

రంగారావు : ఏ వ్యవహారం! వాడితోనేమిటి— నాతో జెప్పు!! ఇంటికి పెద్దవాణ్ణి నేనుండగా వాడేం చెయ్యగలడు?

యోధనాథం : అదేనండీ! మీతోనన్నా చెప్పుకుంటే మాకు న్యాయం జరుగు తుంది!

రావుశ్రీ : నాన్నా! అతని మాటలు నమ్మకండి!

రంగారావు : నువ్వు నోరు ముయ్యిరా! బుర్ర ఉన్న చవటెవడూ నీ మాటలు నమ్మడు!

యోధనాథం : బాగా చెప్పారు! మీ అబ్బాయి మా చెల్లెలిని నాటకాల వెంబడి తిప్పి దాని జీవితం పాడుచేశాడు. ఇప్పుడు దానిని గాలికి వదిలి నె నెరుగను అంటున్నాడు!

రావుశ్రీ : అబద్ధం.

రంగారావు : ఏదిరా అబద్ధం! ఆయన చెప్పిందా? నువ్వు చెప్పబోయేదా? !

యోధనాథం : ఇప్పు డది గర్భవతి! దాని జీవితం ఏం కావాలి చెప్పండి!

రంగారావు : మీ చెల్లెలు అంటే ఎవరు ... వసంతం అన్న పిల్లేనా!

యోధనాథం : ( ఆశ్చర్యపోతాడు. ) మీకు తెలుసా!

రంగారావు : ఇంతకుముందు తెలియదనుకో. ఈ ఉదయం వచ్చింది!

రావుశ్రీ, యోధనాథం: } ఉదయం వచ్చిందా?

రంగారావు : ఆఁ వచ్చింది! పాపం! తన గోడంతా చెప్పుకొని ఏడ్చింది. నేనుమాత్రం ఏం చెయ్యగలను? పోనీ, మా ఇంట్లో ఉండిపో, అమ్మా! అన్నాను. పాపం, చాలా మంచి పిల్ల. 'ఎందుకులెండి. ఆయనకి ఇష్టంలేనిది ఆయనతో నే నెలా కాపురం చెయ్యగలను? పైగా, నే నిక్కడుంటే మరో అమాయకురాలి జీవితం నాశనమవుతుంది. పోనీ, వాళ్లిద్దరి నైనా హాయిగా జీవించనియ్యండి' అంది. చూశారా? ఎంతటి త్యాగం చేసిందో! అలాంటి వాళ్లంటే నాకెంతో ఇష్టం. ఇదిగో, ఈ వెధవ మరో ప్రేమాయణం పెట్టుకోకపోతే తప్పకుండా ఆ అమ్మాయిని నా కోడలుగా చేసుకొని ఉందును. అందుకే జాలివేసి, పోనీ, పదిహేను వేల రూపాయలు ఇప్పను – తీసుకొమ్మన్నాను.

# వందేమాతరం

## కె. వి. అప్పలాచార్యులు

ఇవాళ స్వేచ్ఛాభారతి రజతోత్సవం
చేసుకొంటున్నాం!
ఎదలో మెదిలే పాత జ్ఞాపకాల్ని తలచుకొంటూ
హాయిగా ఊపిరి తీసుకొంటున్నాం!
రండి!
రాజకీయాల సాలెగూళ్ళలోంచి బయటపడి
బూజు పట్టిన బూర్జువా తత్వాలనుంచి తేరుకొని
కుదుటపడి
నిర్మల భారతీయతకు ప్రతీకలుగా నిలబడి
నిండు గుండెల్ని జనని పాదాలపై ఉంచి
నివాళు లర్పించుదాం!
రండి!
కట్టుకొన్న స్వార్థసౌధాల వాకిళ్ళు తెరుచుకొని
కనులగప్పిన నీలి నీలి తెరలు తొలగించుకొని
పాపధ్వాంతంలో పంకిలమైన స్వాంతాన్ని
కాంతి నీరంతో కడుక్కొని
సమతా రూపాన్ని ప్రతిష్ఠించే మానవతా దీపాన్ని
హృదయంలో వెలిగించుకొని
జాతి భవిష్యత్తును
జేగీయమానంగా రూపొందించుకొందాం!
దీక్షబూనండి!
రండి!
భావిభారత భాగ్యోదయంలో
ప్రతిభోజ్వల కాంతికిరణాలమై వెలుగు
వెదజల్లుదాం! పదండి!
విశ్వనందనంలో క్రొత్త శాంతి పారిజాతాన్ని నాటి
విశాల భారతీయతను చాటండి!
విద్వేష నీరధికి విశ్వప్రేమవారధిని నిర్మించుదాం!
నడుంకట్టండి!!
జయపతాక లెత్తండి!
జయశంఖా లొత్తండి!
జయభారతి నుదుట విజయేందిర వీరతిలకం
దిద్దింది!
గుణగానంచేద్దాం! గళమెత్తండి! ★



అలలపై ... చిత్రం— పి. బాలు ( ఫ్లాస్కు - 4 ).

యోధనాధం : పరారయ్యారా?!

రంగారావు : ఆఁ. ఇప్పుడు. కానీ, ఆ అమ్మాయి ఒప్పుకోలేదు. నా ప్రేమకు విలువ కడుతున్నారా అంది. కాదమ్మా! పుట్టబోయే పాపకోసమే నా. నువ్వు ఇది ఒప్పుకోక తప్పదు అన్నాను. ఎంతగానో బలవంతం చేస్తేగాని ఒప్పుకుంది కాదు.

యోధనాధం : తీసుకొని వెళ్ళిపోయిందా?

రంగారావు : ఆఁ వెళ్ళిపోయింది! ఈ పరిసరాలకు దూరంగా హైదరాబాదు వెళ్ళి పోతానని చెప్పింది.

యోధనాధం : అలాగా! ( గొణుక్కుంటూగా ) ఎంత మోసం! నన్ను వెళ్ళమని చెప్పి నా కంటే ముందు ఇక్కడి కొచ్చిందా? నేను తొందరగా వెళ్ళాలి.

రంగారావు : ఆఁబ్బాయ్‌నా! రాకరాక వచ్చావు. ఎంతయినా నీవు మాకు బంధువ్వి! నిన్ను మర్యాద చెయ్యకుండా పంపడం భావ్యమా! ( వీధిలోనికి చూసి ) అదుగో, ఆయన కూడా వస్తున్నారు. రండి, సార్! సమయానికి వేళ మించి పోకుండా దయ చేశారు. ఇంకా స్పేపు ఉంటే ఈ అబ్బాయి వెళ్ళిపోయి ఉండేవాడు. ఇతను మనకు బంధువు. ( ఇన్‌స్పెక్టర్ ప్రవేశిస్తాడు. వెనక సుధ కూడా ప్రవేశిస్తుంది. )

ఇన్‌స్పెక్టర్ : ఆఁ ఆఁ మాకు పాత బంధువే లెండి! ఏం జగన్! ఇంకా ఎన్ని అవతారాలు మారుస్తావు? నువ్వెన్ని వేషాలు వేసినా, రెప్పలులేని మా కళ్ళు కప్పలేవు. అనాథ శరణాలయం నుంచి వసంతం అన్న పిల్లను ఎత్తుకు పోయినందుకు, రంగారావుగారి అబ్బాయిని బ్లాక్ మెయిల్ చెయ్యబోతున్నందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను.

రావుశ్రీ : వసంతాన్ని ఎత్తుకొచ్చాడా!

సుధ : అవును. వసంతం నా స్నేహితురాలు. నాతోబాటే అనాథ శరణాలయంలో పెరిగింది. దాన్ని సినిమాల్లో చేర్పిస్తానని ఆశపెట్టి మోసంచేసి తీసుకు పోయాడు. దాని జీవితాన్ని నాశనం చేసి, మాలాంటి వాళ్ళందరి జీవితాలతోను ఆటలాడ తున్నాడు.

## అంకితం

[ ఈ నాటకం పేరు వినగానే అందరికీ గుర్తుకు వచ్చేది బుచ్చిబాబు నాకు మాత్రం ఏ నాటకాన్ని వ్రాసినా, వేసినా గుర్తుకొచ్చేది ముందుగా గురువుగారైన ఓలేటి బుచ్చిబాబుగారు ఆయన పాత పద్యాలకే ఇది ప్రేమతో అంకితం.

—శ్రీ సిరిచు

ఈ నాటికను ప్రదర్శించగోరువారు బుచ్చిబాబు గారి అనుమతి పొందటం అవసరం ]

నిరాశ : మీకెలా తెలిసిందండీ ఇదంతా? డిటెక్టివ్ సురేఖ లాగ సస్పెన్సంతా క్లియర్ చేసి పారేశారు.

సుధ : ఫోటో చూడగానే పోల్చుకున్నాను. అప్పట్లో ఇలాంటిదే ఒక ఫోటో వసంతం నా కిచ్చింది. అమాయకురాలు. సినీమాతార నవుతున్నానని, తన జీవితం నవవసంతం అవుతుందని పిచ్చెదు ఆశలో గడప దాటింది. బంగారంలాంటి భవిష్యత్తును భగ్నంచేసి, పతితగా, పథవిహీనగా దాన్ని ఫిరాయించాడు. ఈ విషయం బయటపెడితే పారిపోతాడని మీతో పాట్లాట పెట్టుకొని వెళ్ళిపోయాను. దారిలో మామయ్య కనిపించారు. ఆయన కంతా చెప్పాను.

దురాశ : మీకూ ఇదంతా తెలుసా, సార్!!

రంగారావు : తెలియకపోతే కదటోయ్ ఇంతవరకూ వసంతం పదిహేను వేలూ కథ చెప్పి రక్తి కట్టించాను!

యోధనాధం : అంటే. మీరు దానికి పదిహేను వేలు ఇవ్వలేదన్నమాట!

రంగారావు : అంత తేలిగా ఇవ్వడానికి నేను మా అబ్బాయి లాగ చవటాయి ననుకున్నావా రోయ్! మీ అందరికంటే నాటకాలరాయుణ్ణి.

దురాశ : అమ్మ! అమ్మ!! గురువుగారి నాన్నగారూ!

నిరాశ : గట్టివారే!!

ఇన్‌స్పెక్టర్ : ఆల్‌రైట్, రంగారావుగారూ! తరవాత మీరు ఒకసారి స్టేషనకు రండి. మీ అబ్బాయిని కూడా తీసుకురండి. స్టేట్‌మెంట్స్ రికార్డు చెయ్యాలి. ఒన్, టూ నాట్ టూ, వీడికి బేడీలు వెయ్యి! పదా! ( యోధనాధాన్ని పెడపట్టి తోస్తాడు. ) రంగారావుగారూ! వస్తా నండి! థాంక్స్ ఫర్ యువర్ హెల్ప్!!

రంగారావు : అయ్యయ్యో! నా టెలిగ్రామ్!! ( వీధివరకూ వెళతాడు. నిరాశ, దురాశలు అనుసరిస్తారు. సుధ, రావుశ్రీలు మిగిలిపోతారు. రావుశ్రీ ఆమె దగ్గరగా వెళతాడు. )

రావుశ్రీ : నన్ను క్షమించు, సుధా!

సుధ : దేనికి? !

రావుశ్రీ : ( ఆమెను కౌగిలించుకోబోతాడు. )

రంగారావు : ఆగండి. ఓరేయ్! ఇలా రా. రా! ఇకనుంచయినా నాటకాలు మానేస్తావా?

రావుశ్రీ : మానేస్తున్నా నాన్నా!

రంగారావు : ఏమిటి? !

రావుశ్రీ : అవున్నాన్నా. మానేస్తాను. బుద్ధొచ్చింది.

రంగారావు : ఆ పనిట్నర కూతలే కూయద్దన్నాను. మానేస్తావ్! మానేస్తావు! ఇదేనట్రా నీ కళా దీక్ష!! వెనక మేం నాటకాలాడే రోజుల్లో ఎన్ని అవాంతరాలొచ్చినా కళకు ద్రోహం చెయ్యలేదు. రంగస్థలాన్ని విడిచిపెట్టలేదు. ఎటొచ్చీ మీ అమ్మను చేసుకొన్నాక దానికి ప్రాక్టీసు అందించడానికే టైము చాలక మానేశాను.

సుధ : మీరూ నటించేవారా, మామయ్యా?

రంగారావు : లేకపోతే వీడి కెక్కడినుంచొచ్చిందంటావ్ ఆ స్కిల్! ఇంతవరకూ ఎలా నటించాననుకున్నావ్ మరి! ఓహో, నువ్వు చూడలేదు కదూ? ఏమ్మా ఎలా ఉందిరా నా నటన! థ్రిల్‌గా లేదూ!

నిరాశ : థ్రిల్‌గా ఏమిటి, సార్!

దురాశ : వండర్‌ఫుల్‌గా ఉంటేను!!

రంగారావు : ఉండకేం జేస్తుందోయ్! అసలు నటులంతా ఒకే కుటుంబంలా ఉంటే నాటకాలు ఎందుకు రక్తికట్టవు? మా రోజుల్లో సురభి వాళ్ళ నాటకాలు ఎంత రంజుగా ఉండేవని? ఇప్పుడంటే ఉనికి పట్టలేక ట్రూపులు, ట్రూపుకి ఐదారు గ్రూపులూను. ఒరేయ్, అమ్మీ! ఇక నుంచి మన నాటకాల్లో నువ్వు హీరో, కోడలు హీరోయిన్! క్లీన్లీ కమేడియన్సు! వరి గాను ఆ పూర్తి రోల్సు నాకు పెట్టెయ్యండి! ( తెరవైపు కి చూస్తూ ) ఓయ్! ఇంకా నిద్రపోవటం లేదేదా! తెర వెయ్ ! దూరంనుంచి మూగవరకూ గిర్రుతుంటె చెప్పొద్దూ ప్రాణం, అందరికో వాసి చావక ఇదే ... !! ( అంటూ వంటింట్లోకి వెళతాడు. అందరూ నవ్వుతూండగా తెర వాలిపోతుంది. ) ★